గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలి

మోమిన్‌పేట్, మార్చి 9: గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం టేకులపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. టేకులపల్లి గ్రామంలో ఇప్పటి వరకూ రెండు కోట్ల నిధులతో సీసీ, డ్రైనేజీ పనులు, మన ఊరు-మనబడి తదితర పనులు చేయడం జరిగిందని తెలిపారు. శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్‌గౌడ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



సభకు హాజరైన జనం, అభివాదం చేస్తున్న రేవంత్‌రెడ్డి

రెండున్నర గంటలు సభ ఆలస్యం

అధికారికంగా ఖరారైన సమయంకన్నా దాదాపు రెండున్నర గంటల పాటు ఆలస్యంగా ముఖ్యమంత్రి కార్యక్రమం మేడ్చల్‌లో కొనసాగింది. ఉప్పల్, ఎల్బీ నగర్ ప్రాంతాల్లో కొనసాగిన కార్యక్రమాలతో మేడ్చల్‌లో సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం 7గంటలకు ప్రారంభమైంది. సాయంత్రం ఏడు గంటల ఐదు నిమిషాలకు కండ్లకోయ ఐటీటవర్ ప్రాంగణానికి చేరుకున్న సీఎం ముందుగా సికింద్రాబాద్ ప్యారడైజ్-సుచిత్ర ఎలివేటర్ కారిడార్ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం డ్వాక్రా సంఘాలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా మహిళలతో 40నిమిషాలు మాట్లాడారు. అనంతరం 8.10 గంటలకు వేదికవద్దకు చేరుకుని 35 నిమిషాల పాటు ప్రసంగించారు.

పార్టీలో చేరాలనుకున్న వారికి నిరాశ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఉత్సాహంగా ప్రజా దీవెన సభకు విచ్చేసిన నేతలకు నిరాశే మిగిలింది. శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బీజీగా ఉన్న సీఎం సభకు ఆలస్యంగా రావటంతో పార్టీలో చేరదలచిన వారికి కండువా కప్పకుండానే వేదిక దిగి వెళ్లి పోయారు. దీంతో సాయంత్రం నాలుగు గంటల నుంచి తమ అనుచరులతో ఆశతో ఎదురు చూసిన నేతలకు చివరికి నిరాశే మిగిలింది. మాజీ ఎంపీ మధుయాష్కి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పార్టీలో చేరదలచిన వారిని సముదాయించి కండువాలు కప్పారు. సీఎం సమయం తీసుకుని కలిపిస్తామని చెప్పి వారిని పార్టీలో చేర్చుకున్నారు.

పదేళ్లుగా మేడ్చల్ అభివృద్ధి ఆగింది!

- ఈ ప్రాంతం డెవలప్‌మెంట్ కావాలంటే మల్కాజిగిరి ఎంపీ సీటు కాంగ్రెస్ గెలవాలి
- హైదరాబాద్‌కు నలువైపులా ఒకే విధమైన అభివృద్ధి జరగాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

మేడ్చల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/మేడ్చల్ టౌన్, మార్చి 9: పదేళ్లుగా మేడ్చల్ ప్రాంతం అభివృద్ధి ఆగిపోయిందని, గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచే బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో శనివారం నిర్వహించిన మేడ్చల్ ప్రజా దీవెన సభలో సీఎం మాట్లాడారు. హైదరాబాద్ నగరం నలువైపులా అభివృద్ధి జరగాలని, కేంద్ర ప్రభుత్వంతో గత ప్రభుత్వం సఖ్యతగా లేకపోవడంతో నగరానికి ఉత్తర ముఖాన అనేక ప్రాజెక్టులు ఆగిపోయాయన్నారు. నగరానికి ఆనుకుని ఉన్న మేడ్చల్ ప్రాంతం గత పాలకుల నిర్యక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోలేక పోయిందన్నారు. కోకాపేట్‌లో ఎకరం భూమి రూ.వంద కోట్లు పలుకుతుండగా మేడ్చల్ ప్రాంతంలో రూ.10 కోట్లు కూడా లేకపోవటం గత పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. నగరం నుంచి ప్రయాణ సౌకర్యాలు మెరుగుపరచటానికి వంతెనలు, కారిడార్‌లను, మెట్రో రైళ్ల సౌకర్యాన్ని కల్పించాల్సిన గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. మేడ్చల్ జిల్లా సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే ఈ ప్రాంతంలో ఐటీ హబ్‌లు, వ్యాపార సంస్థలు, మెట్రో రైలు, ఎలివేటర్ కారిడార్లు రావాలన్నారు. అందుకుగాను ప్రజల సహకారం తమ ప్రభుత్వానికి అవసరమన్నారు. జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే కూడా లేక పోవటంతో ఈ ప్రాంతం అభివృద్ధి కుంటుపడే ఆస్కారం ఉందన్నారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానం నుంచి తమపార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ఈ ప్రాంతం ప్రతినిధిగా ప్రజలకు అవసరపడే అభివృద్ధి పనులు చేయించుకునే వీలుంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ఈటల చేసిందేమీ లేదు

మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఈ ప్రాంత ప్రజలకు చేసిందేమీ లేదని రేవంత్‌రెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నివాసం ఏర్పచుకుని ఎన్నో సంవత్సరాలుగా ఉంటున్నా ఇక్కడి ప్రజల కోసం ఆయన ఒరగబెట్టిందేమీ లేదన్నారు. పదేళ్ల పాటు బీఆర్ఎస్‌లో అధికారం అనుభవించారని, రెండేళ్లుగా బీజేపీలో ఉన్నారని, అయినా ఏనాడూ మేడ్చల్ ప్రజల కోసం పని చేయలేదన్నారు. ఇప్పుడు ఏం ముఖం పెట్టుకుని ఓట్లడుగుతాడన్నారు. కేవలం అధికారం కోసం మీ మధ్యకు వస్తున్న ఈటలకు బుద్ధి చెప్పాలన్నారు.

14లోపు మల్కాజిగిరి అభ్యర్థి ఖరారు

14వ తేదీ లోపు మల్కాజిగిరి అభ్యర్థిని ఖరారు చేస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అభ్యర్థి పేరు ప్రకటించిన వెంటనే తిరిగి భారీ సభను నిర్వహిస్తామన్నారు. అధికారం లేని నాడే అన్నింటిని తట్టుకుని నిటారుగా నిలబడిన స్థానిక నాయకులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. సభలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, నాయకులు సుధీర్‌రెడ్డి, వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ భేరీ ఈశ్వర్ పాల్గొన్నారు.





రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు

స్వయం సహాయక సంఘాలతో మాటామంతి



మహిళతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కండ్లకోయ వద్ద శనివారం మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలతో ఆత్మీయంగా మాట్లాడారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా తాము జీవితంలో ఎలా అభివృద్ధి చెందారో తెలిపారు. వారి విజయగాథల పట్ల సీఎం హర్షం వ్యక్తం చేశారు. జవహర్ నగర్‌కు చెందిన సుధ(సాయిరాం పొదుపు సంఘం) చేసే పన్నీర్ వ్యాపారంతో ఎలా అభివృద్ధి సాధించారో సీఎంకు తెలియజేశారు. ఘట్‌కేసర్ మండలం అంకుషాపూర్‌కు చెందిన నవనీత అనే మహిళ స్వయం సహాయక సంఘం ద్వారా ఆమె వ్యాపారంలో రాణించిన విధానాన్ని సీఎంకు తెలియజేశారు. అంకుషాపూర్‌కు చెందిన అనిత మాట్లాడుతూ మొదటగా రూ. 5వేలతో గేదెను కొనుగోలు చేశానని, దినదినాభివృద్ధితో ప్రస్తుత్తం 25 గేదెలతో పాల వ్యాపారం చేస్తున్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ విజయ డెయిరీ లీటర్ పాలపై రూ.4 బోనస్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ చేసిన తప్పులను మేము చేయమని, ఏప్రిల్ 4వ తేదీ నుంచి బోనస్ అందజేస్తామన్నారు.

బాగా చదువుకోవాలి..చిన్నారికి సీఎం సూచన

మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఓ మహిళ తన కూతురితో స్టాల్ వద్ద ఉండగా ఆ చిన్నారితో సీఎం మాట్లాడారు. బాగా చదువుకోవాలని సూచించారు. మంచి చదువులు చదివి, పెద్ద ఉద్యోగం సంపాదించుకోవాలని చిన్నారికి చెప్పారు. అందుకు ఆ చిన్నారి సరే సార్.. అన్ని చెప్పడం విశేషం. ఈ సందర్భంగా మహిళలు ఉత్సాహంగా సీఎంతో సెల్ఫీలు దిగుతూ, శాలువాలతో సత్కరించారు.

ఘనంగా విమాన రథోత్సవం

- యాగశాలలో కొనసాగుతున్న వైదిక పూజలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- భక్త జనరంజకంగా బ్రహ్మోత్సవాలు

కీసర, మార్చి9 : కీసరగుట్టలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భక్త జన రంజకంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యల్లో విచ్చేసి రామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మాఘ బహుళ చతుర్థశి శనివారం ఉదయం గర్భాలయంలోని మూలవిరాట్‌కు శ్రీ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గణపతిశర్మ అధ్వర్యంలో యాగశాలలో రుద్రాస్వాహాకార హోమం, ప్రదోషకాల పూజ, నీరాజన, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరిగాయి. బ్రహ్మోత్సవాల్లో నాలుగవ రోజుస్వామివారి విమాన రథోత్సవం కనుల పండువగా జరిగింది. భక్తుల కోలహలం నడుమ ఉత్సవమూర్తులను రథంలో అసీనులను చేశారు. రథం చుట్టు వరి అన్నాన్ని ఏర్పాటు చేసి భూతబలి నిర్వహించారు. ఆనంతరం స్వామివారి విమానరథోత్సవం పార్కు, కీసరవాణి, తమిళుల గూడారాల మార్గం గుండా తామరకొలను వరకూ కొనసాగింది.



రథం ఎదుట పూజలు చేస్తున్న భక్తులు



సంస్కృతిక కార్యక్రమాలు

అలంరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. జాగరణ కోసం ప్రభుత్వం తరఫున ఆలయ ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, కళాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐదో రోజు పూజలు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఐదవరోజు ఆదివారం ఆలయంలో శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. ఆనంతరం కల్యాణ మండపంలో సామూహిక అభిషేకం, ప్రదోషకాల, నీరాజన మంత్ర పుష్పం, వసంతోత్సవం, పుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



విచారిస్తున్న సీఐ రామకృష్ణ

అట్రాసిటీ ఫిర్యాదుపై విచారణ

ధారూరు, మార్చి 9: మండల పరిధి హరిదాసుపల్లిలో అమృతమ్మ అనే మహిళను రాజేందర్‌రెడ్డి కులం పేరుతో దూషించాడని అందిన ఫిర్యాదుపై శనివారం ధారూరు సీఐగ్రామంలో విచారించారు. అమృతమ్మ నిర్మిస్తున్న ఇంటిని ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి కొలవగా రోడ్డును ఆక్రమించి ఇల్లు కట్టినట్టు తేలిందని సీఐ చెప్పారు. దీనికి పెంటయ్య కుటుంబీకులు అభ్యంతరం చెప్పగా వారికి స్థలం అమ్మిన రాజేందర్‌రెడ్డి వచ్చి కొలత వేస్తుండగా అమృతమ్మ కొడుకురాజు వచ్చి రాజేందర్‌రెడ్డిపై దాడిచేసి గాయపర్చి అతడి బైక్‌ను ధ్వంసం చేశాడన్నారు. అలాగే రోడ్డు ఆక్రమించి ఇల్లు కడుతున్నారని ప్రశ్నించిన రాజేందర్‌రెడ్డి, పెంటయ్య కుటుంబీకులపైనా అమృతమ్మ కుటుంబీకులు దాడి చేసినట్టు తన విచారణలో తేలిందని వివరించారు. రాజేందర్‌రెడ్డి కులం పేరుతో ఎవరినీ దూషించలేదని నిర్ధారించామని వివరించారు. విచారణలో సీఐ వెంట ఎస్సై వేణుగోపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నాటు పద్ధతిలో చెరుకు సాగు!

- రైతులకు నారును అందజేస్తున్న షుగర్‌ప్యాక్టరీ



బండమీదిపల్లిలోని రైతు పొలంలో చెరుకు నారు

పెద్దేముల్, మార్చి9 : నాటుపద్ధతిలో చెరుకు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పాతపద్ధతి కంటే కొత్త విధానం ద్వారా అధికదిగుబడి సాధించే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. పెద్దేముల్‌తో పాటు పెద్దేముల్ మండలంలోని మండమీదిపల్లి, తట్టెపల్లి, పాషాపూర్, నాగులపల్లి, బుద్దారం, ఆడ్కిచర్ల తదితర గ్రామాల్లో చెరుకుపంటను అధికంగా సాగు చేస్తారు. అయితే ఇప్పటి వరకు రైతులు చెరుకు సాగుకు పాత విధానాన్నే అనుసరిస్తున్నారు. చెరుకు చిన్న చిన్న ముక్కలుగా నరికి పొలంలో ఏర్పాటు చేసిన బోదెలపై తొక్కేవారు. అయితే ఈవిధానం కంటే కూడా నాటుపద్ధతి ద్వారా చెరుకులో అధికదిగుబడి సాధించవచ్చని సంగారెడ్డిలోని గణేష్ షుగర్‌ప్యాక్టరీ ద్వారా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఆసక్తి కలిగిన రైతులకు మహారాష్ట్రలోని కొల్లాపూర్ నుండి విత్తనమొలకలను తీసుకువచ్చి కేవలం ఒక విత్తనం రెండురూపాయల యాభైపైసలకే అందజేస్తున్నారు. పెద్దేముల్ మండలంలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన రైతు, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య కొత్తపద్ధతిని సాగుచేసుందుకు ముందుకు వచ్చారు. ఆయన ఐదెకరాల పొలంలో చెరుకు సాగుచేయడానికి సిద్ధమయ్యారు. నాటుపద్ధతి ద్వారా చెరుకు సాగుచేస్తే ఎకరాకు 60 నుంచి 70టన్నులు దిగుబడి వస్తుందని చెప్పారు. మొలకపద్ధతి ద్వారా సాగుచేసిన చెరుకుపంటను చూసి వచ్చానని, దిగుబడి బాగుందని చెప్పారు. అందుకోసం తానుకూడా అదే పద్ధతిలో సాగుచేయడానికి ముందుకు వచ్చానని, తాను ఒక మొలకకు రెండురూపాయల యాభైపైసల చొప్పున చెల్లిస్తే షుగర్‌ప్యాక్టరీ యాజమాన్యం తనపొలం వద్దకే మొలకలను అందజేశారని చెప్పారు.




టేకులపల్లిలో బోరునీరు పట్టుకుంటున్న గిరిజన మహిళలు

తాగునీటి కోసం తండావాసుల తిప్పలు

మోమిన్‌పేట్, మార్చి 9: వారం రోజులుగా తాగునీటి కోసం తండావాసులు తంటాలు పడుతున్నారు. మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఆగిపోవడంతో బోరు బావుల వద్దకు పరుగులు తప్పడం లేదు. మోమిన్‌పేట్ మండలంలోని టేకులపల్లి అనుబంధ గ్రామం సిద్దోడు తండాలో నెల రోజుల్లో పది రోజులు మాత్రమే మిషన్ భగీరథ నీరు వస్తుందని గిరిజన మహిళలు వాపోతున్నారు. మిగతా రోజుల్లో నీరు రాకపోవడంతో బోరు నీరే దిక్కని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిధులున్నా... నిరుపయోగం!

- ముగిసిన విద్యాకమిటీల పదవీకాలం
- ఎన్నికలు నిర్వహించని ప్రభుత్వం
- కమిటీలు లేక పాఠశాలల్లో నిధుల వినియోగం కోసం తప్పని తిప్పలు
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న ప్రధానోపాధ్యాయులు



మేడ్చల్ మార్చి 9(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పాఠశాల విద్యా కమిటీల పదవీకాలం ముగియడంతో వాటిని రద్దు చేసిన ప్రభుత్వం తిరిగి ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధుల వినియోగానికి ప్రధానోపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమిటీల పదవీకాలాన్ని పొడిగించకపోవడంతో ఎన్నికలు జరుగుతాయని అందరూ భావించారు. ఎన్నికలను జనవరి 29న నిర్వహించాలని, ప్రభుత్వం అదే నెల 18న ఉత్తర్వులను వెలువరించి ఆతర్వాత నిలిపివేసింది. కాగా నిధుల ప్రత్యామ్నాయ వినియోగానికి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు వెలువరిస్తుందని ప్రధానోపాధ్యాయులు భావించినా ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలందలేదు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఏటా నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం మంజూరు చేస్తుంది. విద్యార్థుల సంఖ్య 1 -30వరకు ఉంటే రూ.10వేలు, 31-100లోపు ఉంటే రూ.25వేలు, 101-250లోపు ఉంటే రూ.50వేలు, 251-1000 మంది ఉంటే రూ.75వేలను ప్రభుత్వం అందిస్తుంది. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి నిర్వహణ ఖర్చులకు సంబంధించిన నిధులను పాఠశాల ఖాతాల్లో జమ చేయాలి. ఈ నిధులతో పాఠశాలల్లో స్టేషనరీ కొనుగోలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపు, కంప్యూటర్ల నిర్వహణ, శుభ్రత కోసం వినియోగించాల్సి ఉంటుంది. పీఎంశ్రీ కింద ఉన్న పాఠశాలలకు ఫిబ్రవరిలో నిధులు మంజూరయ్యాయి. జనవరిలో కమిటీలు రద్దు కావడంతో ఖర్చు చేసిన వాటికి కూడా చెల్లింపులు చేయలేకపోతున్నారు.

మూడు నెలలుగా జరగని సమావేశాలు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ పాఠశాలలు మొత్తం 515 ఉన్నాయి. ప్రతీ పాఠశాలకు విద్యాకమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుడి జాయింట్ బ్యాంక్ ఖాతా ఉంటుంది. గ్రాంట్ కింద వచ్చిన డబ్బులకు జాయింట్ చెక్ పవర్ ఉండటంతో ఇద్దరి ఆమోదంతోనే డబ్బులను డ్రా చేయవచ్చు. కమిటీల రద్దుతో డబ్బులను డ్రా చేయలేకపోతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు - మన బడికి పనులకు సంబంధించి ప్రత్యేకంగా ఖాతాలను తీయించారు. కమిటీలు రద్దు కావడంతో పనులు పూర్తయిన చోట కాంట్రాక్టర్లు చెక్కులను అందించలేకపోతున్నారు. మూడు నెలలుగా పాఠశాలల్లో విద్యా కమిటీ సమావేశాలు లేకపోవడంతో పలు పాఠశాలల్లో సమస్యలను చెప్పుకునే వీలు లేకుండా పోయింది. ప్రభుత్వం ఎటువంటి మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులకు గురౌతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యామ్నాయ మార్గదర్శకాలను సూచించాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

సీఎం సభకు భారీగా తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఘట్‌కేసర్, మార్చి 9 : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా దీవెన సభకు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలతోపాటు చౌదరిగూడ పంచాయతీ కాంగ్రెస్ కార్యకర్తలు తరలివెళ్లారు.మధ్యాహ్నం నుంచి బస్సుల్లో కార్యకర్తలు సభకు తరలివెళ్లారు.ఘట్‌కేసర్‌లోని శివారెడ్డిగూడ దండ్లగడ్డ ప్రసన్నాంజనేయ ఆలయం నుంచి ర్యాలీగా వెళ్లారు. పోచారం మున్సిపాలిటీ కార్యకర్తలు అన్నోజిగూడ నుంచి, చౌదరిగూడ వారు వెంకటాద్రి టౌన్‌షిప్ నుంచి ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమాల్లో మల్లేష్, నాగరాజు, సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్. భారీ సంఖ్యలో మహిళలు ఉన్నారు.



ఘట్‌కేసర్ నుంచి బహిరంగ సభకు తరలుతున్న కార్యకర్తలు

డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు కవాతు

దోమ, మార్చి 9: దోమలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు కవాతుతో ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరి సహకారం ఉండాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై ఆనంద్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

రేపు డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు

వికారాబాద్, మార్చి 9: జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ పరీక్షలకు గాను అభ్యర్థులకు ఈ నెల 11న సోమవారం రోజున ఏకేఆర్ స్టడీ సర్కిల్లో ఎస్జీటీ, ఎస్ఏ బయాలాజికల్ సైన్స్ అభ్యర్థులకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తామని స్టడీ సర్కిల్‌డైరెక్టర్ బీవీ.రమణ శనివారం తెలిపారు. ఈ సదస్సుకు పోటీ పరీక్షల నిపుణులు హాజరై సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. బీఎడ్/డీఎడ్ అభ్యర్థులు అభ్యర్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9441022571 అనే నంబర్లో సంప్రదించాలన్నారు. అవగాహన సదస్సు తరగతులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు.

బాండ్ డబ్బులు, పీఆర్సీ విడుదలతో ఆర్టీసీ ఉద్యోగుల హర్షం



హకీంపేట ఆర్టీసీ డిపో వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

శామీర్‌పేట, మార్చి 9: ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి కొన్నేళ్లుగా ఆర్టీసీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన 50శాతం బాండ్ డబ్బులు,2017 పీఆర్సీ ఇచ్చారని మండలంలోని హకీంపేట ఆర్టీసీ డిపో ఉద్యోగులు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు సీఎంకు ధన్యవాదాలు తెలియజేశారు. డిపో టీఎంయూ కార్యదర్శి గోపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కులకు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు.లోక్‌సభ ఎన్నికల తర్వాతైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.


బహుమతులు అందిస్తున్న విజయరావు

మహిళలు నిత్యం వ్యాయామం చేయాలి

కందుకూరు, మార్చి 9 : మహిళలు నిత్యం వ్యాయామం చేయాలని నెహ్రూ యువకేంద్ర సంఘటన్ రాష్ట్ర డైరెక్టర్ ఏఆర్ విజయరావు కోరారు. నారీశక్తి ఫిట్‌నెస్ రన్‌లో భాగంగా శనివారం గూడూరు గేటు వద్ద గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో 15 నుంచి 29 వయస్సు గల బాలికలు, యువతులు, మహిళలకు నిర్వహించిన 500 మీటర్ల రన్నింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాయామం చేయడం వల్ల ఆరోగ్యవంతంగా జీవనం సాగించడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మహిళలకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా నెహ్రూ యువ కేంద్రం అధికారి హిల్సయ్య, ఎంపీడీవో సరిత, పీడీ శేఖర్, పీఈటీలు శ్రావణి, హరిక, సాంఘిక సంక్షేమ గురుకులు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, ఐకేపీ ఏపీఎం కవిత, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌జామ్‌తో ప్రయాణికుల ఇక్కట్లు

- రోడ్డుపక్కనే టిఫిన్ సెంటర్ల ఏర్పాటు
- పార్కింగ్ స్థలం లేకపోవడంతో ఇబ్బందులు
- ట్రాఫిక్ పోలీసుల వైఫల్యమే కారణం!

మొయినాబాద్ రూరల్, మార్చి 9 : ట్రాఫిక్ పోలీసుల వైఫల్యంతో ప్రయాణికులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. నగర శివారు అప్పా జంక్షన్ నుంచి హిమాయత్‌నగర్ చౌరస్తా వరకు హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. పలు చోట్ల చౌరస్తాల వద్ద టిఫిన్ సెంటర్లు రోడ్డుపక్కనే ఏర్పాటు చేయడంతో అటుగా వెళ్లేవారు తమ వాహనాలను రోడ్డుకు ఆనుకొని నిలుపుతున్నారు. దాంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల చిలుకూరు బాలాజీ దేవాలయానికి వెళ్లే ప్రయాణికులతో రోజూ వాహనాల రద్దీ ఉంటుంది. శని, ఆదివారాల్లో వాహనాల రాకపోకలు మరీ ఎక్కువ. అప్పా జంక్షన్ నుంచి హిమాయత్ నగర్ చౌరస్తా వరకు మూడు కిలోమీటర్లు ఉంటుంది. ఈ దూరానికే కనీసం గంటన్నర సమయం పడుతుందని.. దాంతో గంటల తరబడి రోడ్డుపైనే వాహనాలను నిలపాల్సిన పరిస్థితి నెలకొందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఇంటర్ పరీక్షలు మొదలవ్వడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరిగిపోయింది. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోలేని పరిస్థితి నెలకొందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన టిఫిన్ సెంటర్లను తొలగించి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రాజేంద్రనగర్, హిమాయత్‌నగర్ ట్రాఫిక్ పోలీసుల వైఫల్యంతోనే సమస్య ఉత్పన్నమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని.. రోడ్డుపక్కనే టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేసినా నిర్వాహకులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు.


అజీజ్‌నగర్ వద్ద హైదరాబాద్-జాతీయ రహదారి పక్కన టిఫిన్ సెంటర్ల వద్ద నిలిపిన వాహనాలు

వైభవంగా శివపార్వతుల కల్యాణం

- పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజలు.. అన్నదాన కార్యక్రమాలు

యాచారం, మార్చి 9 : ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని, తద్వారా సమాజంలో శాంతి నెలకొంటుందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం. కోదండరెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని నందివనపర్తిలోని శివాలయంలో బిలకంటి అర్చనచంద్రశేఖర్‌రెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ ఉదయశ్రీ రవీందర్‌రెడ్డి దంపతులు శివపార్వతుల కల్యాణం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. నందీశ్వరాలయంలో మాజీ ఎంపీపీ రాచర్ల లక్ష్మీకళ వెంకటేశ్వర్లు దంపతులు భ్రమరాంబశివుడి కల్యాణం జరిపించారు. వందలాది మంది భక్తుల సమక్షంలో స్వామివార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యాచారం సీఐ శంకర్ కుమార్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

మల్లప్ప గుట్టలో ఘనంగా కడవ(బోనాలు)

ఆమనగల్లు : జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా ప్రసిద్ధిగాంచిన తలకొండపల్లి మండలం చెన్నారం గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లప్ప గుట్టపై గల శ్రీమల్లిఖార్జున స్వామి ఆలయంలో శనివారం కడవ (బోనాలు) కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. కడవ (బోనాలు) కార్యక్రమానికి ఆలయ నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు గావించారు. చెన్నారం, యెడవల్లి, చుక్కాపూర్, ఖానాపూర్, వితాయపల్లి, మంగళపల్లి, జంగారెడ్డిపల్లి, పడకల్ తదితర గ్రామాల నుంచి కడవల ఊరేగింపుతో మహిళలు మల్లప్ప గుట్టకు చేరుకున్నారు. బోనం కుండలను అలంకరించుకొని పట్టువస్త్రాలు ధరించి నైవేద్యంతో ఆలయానికి వచ్చిన మహిళలుస్వామి వారిని దర్శించుకొని అనంతరం ఆలయ సమీపంలోని గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సత్యనారాయణస్వామి వ్రతాలు, అభిషేకాలు, హోమం నిర్వహించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన జాతర ఎగ్జిబిషన్‌ను తలపించింది. ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, కడ్తాల సీఐ శివప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐలు శ్రీకాంత్, వరప్రసాద్, బాల్‌రామ్ నాయక్‌ల ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. చుక్కాపూర్ గ్రామానికి జక్కు శ్యామలమ్మనారాయణరెడ్డి దంపతులు, వారి కుమారులు జగత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డిల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.


యాచారం : నందివనపర్తిలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


మహేశ్వరం : ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్ దంపతులు

బ్రహ్మోత్సవాలకు వేంకటేశ్వరాలయం ముస్తాబు

ఆమనగల్లు : జిల్లాలో ప్రసిద్ధ ప్రముఖ పుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా వెలుగొందుతున్న ఆమనగల్లు పట్టణంలోని అలివేలుమంగ సమేత శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామిదేవాలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ప్రతీయేటా ఫాల్గుణ శుద్ధ సప్తమి మొదలు ఫాల్గున శుద్ధ ఏకదశి వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు ఇక్కడ కన్నుల పండువగా నిర్వహిస్తారు. జిల్లా నలు మూలల నుంచే కాకుండా మహబూబ్ నగర్, హైదరాబాద్, నల్గొండ, నాగర్‌కర్నూల్, తదితర జిల్లాల నుంచి ఆమనగల్లు జాతరకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. 124వ బ్రహ్మోత్సవాల కోసం విశాల వసతులు ఏర్పాటు చేశారు.


షాబాద్ : ఎడ్లబండి పోటీలను ప్రారంభిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, నాయకులు

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 16నుంచి 20వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాలను ప్రధాన అర్చకుడు గూడ కృష్ణమాచార్య వివరించారు. 16న విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అంకురార్పణం, దేవతాహ్వానం, భేరిపూజ, 17న సుప్రభాతసేవ, నిత్యారాధన, మహాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణం, ఎదుర్కోళ్లు, 18న స్వామివారి కల్యాణం, 19న రథోత్సవం, రాత్రికి దీపోత్సవం, 20న చక్ర తీర్థం, పూర్ణాహుతి, నాగావళి, దేవతా ఉద్వాసన కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

లింగంధనలో ఘనంగా శివపార్వతుల కల్యాణం

కేశంపేట : మండల పరిధిలోని లింగంధన గ్రామంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పండితులు సీతారామశర్మ మంత్రోచ్ఛరణల మధ్య గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, కొకుంట్ల శ్రీనివాస్‌రెడ్డి, రాజుగౌడ్ దంపతులు కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు శ్రీనివాస్‌రెడ్డి అన్నదానం చేశారు. కార్యక్రమంలో గుబ్బ సుదర్శన్‌గుప్తా, మధుసూదన్‌గౌడ్, లక్ష్మీనర్సింహారెడ్డి, పాండురంగారెడ్డి, వెంకట్, సుకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివనామస్మరణతో మార్మోగిన రాజరాజేశ్వరాలయం

మహేశ్వరం : మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయం మహాశివరాత్రి పురస్కరించుకొని శివనామ స్మరణతో మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రుద్రాభిషేకం, కుంకుమార్చన, మంగళహారతి, సహస్రనామార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా ఉపవాస దీక్షలు విరమించేందుకు శనివారం ఉదయం నుంచి భక్తులు స్వామి దర్శనం చేసుకున్నారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతిధి టి.వీరేందర్‌గౌడ్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా, శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో జబర్దస్త్ ఫేమ్ బృందంతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఇన్‌చార్జి ఎంపీపీ సునీతా అంధ్యా నాయక్, మాజీ చైర్మన్లు కూన యాదయ్య, ఈశ్వర్‌ముదిరాజ్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పోతర్ల సుదర్శన్ యాదవ్, మునగపాటి నవీన్, కాకి కుమార్, డైరెక్టర్లు రాఖేష్, జగన్, సాయిలు, కన్నయ్య, శ్రీశైలం లతో పాటు నాయకులు పూర్ణచంద్రారెడ్డి, ఆనందం, సూర్యనారాయణరెడ్డి, జి. జంగయ్య, భిక్షపతి, సత్యనారాయణ, కె.చందు, యాదయ్యగౌడ్, మల్లేష్, మైసయ్య, శ్రీకాంత్, ఆలయ ఈవో మురళీకృష్ణ, ప్రధాన అర్చకులు వీరేషం పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కడ్తాల్ : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయ స్వామి ఆలయంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కంబాలపల్లి జగన్ కల్పన దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జడ్పీటీసీ దశరథ్ నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ సర్పంచ్‌లు శంకర్, లక్ష్మీనర్సింహారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : జనసంద్రంగా మారిన మల్లప్ప గుట్ట

కనుల పండువగా మల్లన్న కల్యాణం

షాబాద్ : మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయితీకి అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో శనివారం మల్లన్న స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం బోనాలతో పెద్దఎత్తున తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. దేవాలయం చుట్టూ ఎడ్లబండ్లు తిప్పుతూ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి కల్యాణంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకులు పొన్న వెంకట్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లింగం, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లన్నస్వామి దేవాలయం పునర్నిర్మాణానికి దామర్లపల్లి మాజీ సర్పంచ్ బోకుల లింగం రూ.లక్షా 50వేల విరాళం ఆలయ కమిటీకి అందజేశారు.


కేశంపేట : లింగంధనలో శివపార్వతుల కల్యాణం

శివశివా.. రామేశ్వరంలో మాంసం, మద్యం విక్రయాలు

షాద్‌నగర్ రూరల్, మార్చి 9: ఉత్తర రామేశ్వరంగా పేరు పొందిన పుణ్యక్షేత్రం రామేశ్వరంలో మద్యం, మాంసం విక్రయాలు విచ్చలవిడిగా జరగడంతో ఆలయ అపవిత్రమవుతుందని భక్తులు ఆందోళన చెందుతున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇక్కడ వారం రోజులు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. శుక్రవారం మహా శివరాత్రి పర్వదినం ముగియడంతో ఇంకా రథోత్సవం జరగనుంది. ఈక్రమంలో శనివారం ఉదయం నుంచే ఆలయ పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఆలయం ముందు నుంచి ఉన్న సూరారం రోడ్డు వెంట దర్జాగా మాంసం దుకాణాలు వెలిశాయి. వాటి వెనుకనే పెద్ద టెంట్ వేసి కల్లు విక్రయాలు చేస్తుండగా.. అక్కడికి కొంతదూరంలో మద్యం విక్రయిస్తున్నారు. అంతేగాకుండా ఆలయ పరిసరాల్లోని కిరాణాషాపుల్లో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో మాంసం, మద్యం విక్రయాలు జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు.


రామేశ్వరం పరిసరాల్లో కొనసాగుతున్న కల్లు, మాంసం విక్రయాలు

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శామీర్‌పేట, మార్చి 9 : సాంఘిక సంక్షేమ డిగ్రీ మహిళా కళాశాలల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఇఫ్రత్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీజీఆర్డీసీ-సెట్(సీఈటీ)-2024 ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు, ప్రస్తుతం ఎగ్జామ్స్ రాస్తున్న ఆసక్తి గల విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం చదివేందుకుగాను ఏప్రిల్ 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలల్లో ఉచిత విద్యతో పాటు వసతి ఉంటుందని తెలిపారు. శామీర్‌పేటలోని కళాశాలలో బీఎస్సీ హానర్స్, కంప్యూటర్ సైన్స్ (నాలుగు సంవత్సరాల కోర్సు), సిరిసిల్ల కాలేజీలో బీఎస్సీ హానర్స్ డిసైనింగ్ అండ్ టెక్నాలజీ నాలుగు సంవత్సరాల కోర్సు, బీఎస్సీ ఫిజికల్ సైన్స్(సీబీసీఎస్), సబ్ మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ జియాలజీ, బీఎస్సీ లైఫ్‌సైన్సెస్(సీబీసీఎస్), సబ్ మైక్రోబయోలాజీ, బయోటెక్నాలజీ, బోటనీ, జియాలజీ, కెమిస్ట్రీ, బీకామ్ సీఏ, బీకామ్ బీఏ, బీఏ అండ్ బీబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పైకోర్సులకు దరఖాస్తు చేసుకొనే విద్యార్థులకు సంవత్సర ఆదాయం గ్రామీణ ప్రాంతాలవారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాలవారికి రూ.2 లక్షల లోపు ఉండాలని చెప్పారు. దరఖాస్తుదారులకు ఏప్రిల్ 28న ఎంట్రన్స్ ఎగ్జామ్ ఉంటుందని, ఏప్రిల్ 12 లోపు కళాశాల వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నాం

- విలేకరుల సమావేశంలో నాయకుల వెల్లడి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పెద్దేముల్, మార్చి 9 : బీఆర్ఎస్ పార్టీకి తామంతా మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నామని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. తాము పార్టీకోసం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నా.. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తమను పట్టించుకోవడం లేద న్నారు. ఏ కార్యక్రమాలు ఉన్నా.. సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. గుర్తింపులేని చోట ఉండడం సరికాదని.. తాము పార్టీకి రాజీనామా చేస్తున్నామని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అందరితో మాట్లాడామని, అందరం కలిసి రాజీనామాలు చేద్దామనే నిర్ణయానికి వచ్చామని చెప్పారు. మళ్లీ ఒకసారి తామంతా కలిసి చర్చించుకొని మూకు మ్మడిగా నాయకులు, కార్యకర్తలందరం రాజీనామాలు చేసి పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపించనున్నామని తెల్పి చెప్పారు. రాజకీయంగా ఏ పార్టీలో చేరాలనే విషయాన్ని తామంతా కలిసి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని అన్నారు. పార్టీపట్ల తమకు ఎలాంటి చెడు అభిప్రాయం లేదని, నాయకుడనేవాడు పార్టీకోసం పనిచేసే వాళ్లకు గుర్తింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డీవై నర్సిములు, నాయకులు ఇందూరు ప్రకాష్, ఎంపీటీసీ యాలటి శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, రాంచంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు గేమ్యానాయక్, కుర్వ లక్ష్మణ్, నాయకులు నారాయణగౌడ్, అంజిల్‌రెడ్డి, ఆజం, కుమ్మరి విఠల్, ఎర్ర రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలి

మేడ్చల్ టౌన్, మార్చి 9 : మేడ్చల్ ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించాలని బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ తనకు కల్పించారని అన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. నిస్వార్థంగా రాజకీయాలు చేసే తనకు ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం ఉందన్నారు. తన విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, నాయకులు కృష్ణగౌడ్, హంసారాణి, అమరం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.


ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న గుండ్లపోచంపల్లి బీజేపీ నాయకులు

బొంరాస్‌పేట్ మండలంలో జోరుగా సీసీ రోడ్డు పనులు


బొంరాస్‌పేట్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ మైపాల్

బొంరాస్‌పేట్, మార్చి 9: మండల కేంద్రంతో పాటు మండలంలోని మహంతీపూర్, తదితర గ్రామాల్లో ఉపాధిహామీ నిధుల ద్వారా సీసీ రోడ్డు పనులు జోరుగా కొనసాగుతున్నాయి. శనివారం ఆయా గ్రామాల్లో సీసీ రోడ్డు పనులను మహంతీపూర్ మాజీ సర్పంచ్ మైపాల్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులతో ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న నాయకులు

- మతి స్థితిమితం సరిగాలేని యువకుడికి సపర్యలు
- పోలీసుల ద్వారా పునరావాస కేంద్రానికి..

కడ్తాల్, మార్చి 9: మతిస్థిమితం సరిగా లేని యువకుడికి సపర్యలు చేయించి నాయకులు మానవత్వం చాటుకున్నారు. మాసిన బట్టలు, పెరిగిన గడ్డంతో తిరుగుతున్న యువకుడికి సరపర్యలు చేసి పోలీసుల ద్వారా పునరావాస కేంద్రానికి తరలించారు. మండల కేంద్రంలోని శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రెండు నెలలుగా ఓ యువకుడు అటూ ఇటూ తిరుగుతూ రోడ్డు పక్కన నివాస గృహాలవారు పెట్టే భోజనం తింటూ కాలం వెళ్లదీస్తున్నాడు. దాంతో యువకుడిని వివరాలు అడుగగా.. బీహార్‌లోని కళ్యాన్‌పూర్ అని చెప్పాడు. దాంతో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కడ్తాల చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్‌లు శనివారం ఉదయం ఆ వ్యక్తిని చేరదీశారు. ఈ మేరకు ఆయ యువకుడికి క్షౌరం చేపించి, స్నానం చేయించి, కొత్త బట్టలు సమకూర్చారు. ఎస్ఐ వరప్రసాద్‌ను కలిసి యువకుడి గురించి వివరించారు. ఎస్ఐ యువకుడితో మాట్లాడగా తన పేరు మోహిత్ అని చెప్పాడు. ఎస్ఐ బీహార్‌లోని కళ్యాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చేసి యువకుడి సమాచారం అందించారు. అతడి ఫొటోలు పంపించారు. సమాచారం తెలిస్తే తెలపాలని కళ్యాన్‌పూర్ పోలీసులకు సూచించారు. అనంతరం ఆ యువకుడిని పోలీసు సిబ్బంది ద్వారా హైదరాబాద్‌లోని నాదర్‌గుల్ ఆనాథాశ్రమానికి తరలించారు.


యాచకుడితో ఎస్ఐ వరప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు

అగ్నిగుండ ప్రవేశాలు.. అన్నదానాలు

● శివాలయాల్లో భక్తుల పూజలు.. ఉపవాస దీక్షల విరమణ



ఎదులాబాద్‌లోని భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయం వద్ద అగ్నిగుండంపై నడుస్తున్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 9 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఎదులాబాద్‌లోని భ్రమరాంభిక మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. శనివారం ఉద యం శివలింగానికి అభిషేకాలు చేసిన అనంతరం అగ్నిగుండాల వద్ద గుమ్మడి, కొబ్బరికాయలు కొట్టారు. భక్తులు శివనామస్మరణ చేస్తూ అగ్ని గుండాలపై నడిచారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నప్ప, ప్రదీప్, నరేష్, శంకరప్ప, ఓం ప్రకాశ్, ఎంపీటీసీ కె.సరళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి : మండలంలోని వివిధ గ్రామాల శివాలయాలు భక్తులతో కిటకిలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి శివుడికి పూజలు, అభిషేకాలు చేశారు. మహా శివరాత్రి రోజు ఉపవాసం ఉన్న వారి కోసం ఆలయ కమిటీలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్ : శివపార్వతుల పల్లకీ సేవలో శంకర్‌నాయక్, వాసుపవార్ తదితరులు

వికారాబాద్: మండలంలోని పులుసుమామిడిలో గల పార్వతీ పరమేశ్వర ఆలయంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామం నుంచి ఆలయం వరకు స్వామివారిని పల్లకిపై ఊరేగించి కొండపై ఆలయ సమీపంలో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. వేడుకకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అల్లుడు అనన్యచేతన్ పాల్గొన్నారు. ఇక్కడ పెద్దఎత్తున జాతర నిర్వహించారు. అనంతరం స్వామి సన్నిధిలో అన్నదానం నిర్వహించగా ఉపవాస దీక్షాపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ధారూరు: శుక్రవారం అర్ధరాత్రి నుంచి లింగోద్భవ పూజలు నిర్వహించారు. ధారూరు వీరభద్రేశ్వరాలయంలో లింగాన్ని జలం, పంచామృతంతో అభిషేకం చేసి పసుపు, కుంకుమ, పుష్పాలతో అలంకరించారు.

పరిగి: మండల పరిధి శివాలయాల్లో శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. రూప్‌ఖాన్‌పేట్, సయ్యద్‌పల్లి, బసిరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. సయ్యద్‌పల్లిలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి.పరుశరాంరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

తాండూరు రూరల్: మండల పరిధి అంతారంలో గల ద్వాదశ



వికారాబాద్: కల్యాణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

జ్యోతిర్లింగ ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మూడు రోజులు ఉత్సవాలు జరిగాయి. భూకైలాస్ ఆలయ వ్యవస్థాపకులు వాసు పవార్‌నాయక్, రాష్ట్రపతి అవార్డీ, ఆల్ ఇండియా బంజారా సేవా సంస్థ అధ్యక్షుడు శంకర్‌నాయక్ కుటుంబీకులతో కలిసి శివలింగానికి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. శనివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణాన్ని నిర్వహించారు. పెళ్లి పెద్దలుగా పవార్ శాంతిబాయి, రూప్‌సింగ్, కమలాబాయి దంపతులు కూర్చున్నారు. ప్రధానార్చకులు బిచ్చయ్య, రవి, ఆనంద్‌ల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. వీరభద్ర ఖడ్గాలు, భజనలతో తండా మార్మోగింది. నీటిమార్గం గుండా ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని ఎల్లమ్మకు, సేవాలాల్ మహరాజ్,కాళికాదేవి, ఇతర దేవతామూర్తులకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అంతారం తండామాజీ సర్పంచ్‌లు రాంచందర్, సావిత్రిబాయి,నాయకులు గోపాల్, రాము పాల్గొన్నారు. అనంతరం భూకైలాస్‌లో 65 అడుగుల శివుడి విగ్రహాన్ని చేసిన మహారాష్ట్ర శిల్పి మారుతి మహదేవరావు, భీమ్‌మల్లే, కర్ణాటకకు చెందిన పెయింటర్ ఉదయ్‌కుమార్‌లను సన్మానించారు.

బషీరాబాద్: జీవన్గి మహదేవ లింగేశ్వరాలయ జాతర వైభవంగా కొనసాగుతోంది. జాతర మూడోరోజు పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. పట్లోళ్ల వీరారెడ్డి దంపతులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు. అనంతరం రథోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహదేవలింగేశ్వరుడిని దర్శించుకొని ఉపవాస దీక్షలు విరమించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానాన్ని చేపట్టారు. జాతరలో భాగంగా ఆదివారం కాగ్నానదిలో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీల్లో స్థానికులు, కర్ణాటక, మహారాష్ట్రల మల్ల యోధులు పాల్గొంటారు.



పరిగి మండలం సయ్యద్‌పల్లిలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

యాలాల: మండల పరిధి సంగెంకుర్దు సంగమేశ్వరాలయంలో శివరాత్రి రోజు ఉపవాసాలున్న భక్తులు పూజలు నిర్వహించారు. దీక్షలు విరమించారు. మాజీ సర్పంచ్‌లు హనుమంతు, శంకరమ్మ పూజలు నిర్వహించారు. ఎంపీపీ అనంతయ్య అన్నదానం నిర్వహించారు.

కులకచర్ల: చౌడాపూర్ మండలం మందిపాల్‌లో ఓంకారేశ్వర ఆలయంలో మూడూ రోజులు ఉత్సవాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఓబీసీమోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, మఠం ప్రమీల, రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: లొంక బసవన్నకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కస్తూర్‌పల్లిలో వెలిసిన లొంక బసవన్న ఆలయానికి మండల ప్రజలు, పరిసర గ్రామాలు, కర్ణాటక ప్రాంత భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. శివలింగానికి, ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రశాంత్,మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శామీర్‌పేట: మండలంలో శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగవైభోగంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి శామీర్‌పేట శ్రీభవానిరామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధానర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో మరో ఆరు మంది వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. జాగరణలో భాగంగా జవహర్‌నగర్‌కు చెందిన హరిహర భక్త భజనమండలి ఆధ్వర్యంలో సదాచారి భజనలు చేశారు. శనివారం తెల్లవారు జామున స్వామివారికి మంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థప్రసాద వితరణ చేశారు. తూంకుంటలోని గాయత్రి మహాక్షేత్రంలో ఆలయ వ్యవస్థాపకులు ఎస్‌విఎల్‌ఎన్.మూర్తి ఆధ్వర్యంలో ఉమామహేశ్వరస్వామి కల్యాణాన్ని నిర్వహించారు. శామీర్‌పేటలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలియాబాద్‌లో కంఠం క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా లాల్‌గడిమలక్‌పేటలో ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో అన్నదానం నిర్వహించారు.



కొడంగల్ రూరల్ : లొంక బసవన్న ఆలయం వద్ద ఉపవాస దీక్షల విరమణలు



యాలాల: సంగమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మాజీ సర్పంచ్‌లు హనుమంతు, శంకరమ్మ



జీవన్గి మహదేవ లింగేశ్వరాలయ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



శామీర్‌పేట: భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు

ఘట్‌కేసర్, మార్చి 9: మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో శుక్రవారం రాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని సీ-2లో గోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో అసోసియేషన్ అధ్యక్షుడు రాములు నాయక్ మాట్లాడుతూ నేడు మహిళలు చైతన్యవంతులు అయి అన్ని రంగాల్లో ముందుంటున్నారని అన్నారు. ప్రధానంగా సామాజిక సేవల్లోనూ మహిళలు సత్తా చాటుతున్నారని, ఇది హర్షించ దగ్గ పరిణామమన్నారు. ప్రతీ సంవత్సరం మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం మహిళలు భారీగా తరలివచ్చి ఆటపాటలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో చంద్రదాస్, సంతోష్‌కుమార్, శంకర్, రవి, దాస్రు, నెహ్రూనాయక్, హన్మంతు, ఉమ్లానాయక్, అంజూనాయక్, హరిజీ నాయక్ తదతరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో మహిళా దినోత్సవ వేడుకల్లో నృత్యం చేస్తున్న మహిళలు

దేశ యువతంతా ..
నరేంద్రమోదీ వెంటే

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 9: దేశ యువత మొత్తం ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటే ఉన్నారని బీజేవైఎం జిల్లా కార్యదర్శి కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం అంకుషాపూర్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యువ చౌపల్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివరించారు. ప్రపంచంలోనే మోదీ బలమైన నాయకుడని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేసేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు సురేంద్ర, భరత్‌రెడ్డి, నిఖిల్, మణి, హరీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా శ్రీదేవి



శ్రీదేవి

వికారాబాద్, మార్చి 9: బీజేపీ అనుబంధ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా వికారాబాద్ మునిసిపల్ కౌన్సిలర్ శ్రీదేవిని రాష్ట్ర మోర్చా అధ్యక్షులు శిల్పారెడ్డి నియమించారు. రాష్ట్ర కమిటీలో భాగంగా శ్రీదేవికి అవకాశం ఇవ్వగా శ్రీదేవి భర్త సదానందారెడ్డి సైతం మొన్నటి వరకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను నిర్వహించారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించడం సంతోషంగా ఉందని, తనకు ఈ అవకాశం కల్పించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల నియోజకవర్గంలో గెలుపొందే విధంగా కృషిచేస్తామని ఈ సందర్భంగా శ్రీదేవి తెలిపారు.

వివిధ మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షుల నియామకం

వికారాబాద్, మార్చి 9 : జిల్లాలోని వివిధ మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులను నియమించింది. నియామకపత్రాలను జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి వికారాబాద్‌లోని నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. వికారాబాద్ మండలానికి మునుగాల గోపాల్‌రెడ్డి, బంట్వారానికి మహేష్, మోమిన్‌పేటకు లక్ష్మారెడ్డి, నవాబుపేటకు నరేందర్‌రెడ్డి, తాండూర్ రూరల్‌కు ప్రభుశంకర్, తాండూర్ పట్టణానికి నాగారం మల్లేశం, బషీరాబాద్‌కు రాఘవేందర్, యాలాల్‌కు యాదగిరి, పెద్దేముల్‌కు హరీష్‌గౌడ్, కుల్కచర్లకు జెమిని సూర్యకాంతం, చౌడపూర్‌నకు బందయ్యలను అధ్యక్షులుగా నియమించారు.

ధారూరు: ధారూరు బీజేపీ మండల మండలాధ్యక్షుడిగా ధారూరుకు చెందిన ఎం.రమేశ్‌ను నియమించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.మాధవరెడ్డి నియామకపత్రం అందజేశారు. గతంలోనూ పార్టీ అధ్యక్షుడి బాధ్యతలు నిర్వహించిన రమేశ్‌కు మరోసారి అవకాశం ఇచ్చారు.

దోమ: దోమ మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా పి.అనంతయ్య నియామకమయ్యారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పార్టీ పటిష్టతకు కృషిచేస్తానని తెలిపారు. నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

పూడూరు: పూడూరు మండల బీజేపీ నూతన అధ్యక్షుడిగా ఎన్కెపల్లికి చెందిన రాఘవేందర్ నియమితులయ్యారు. రాఘవేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వివిధ మండలాల అధ్యక్షులు ..



పి.అనంతయ్య(దోమ)



ఎం.రమేశ్(ధారూర్)



రాఘవేందర్(పూడూరు)



రామేశ్వర్‌రెడ్డి (మర్పల్లి)



నాగారం మల్లేష్ (తాండూరు పట్టణం)



జి.బాలకిష్టారెడ్డి (పరిగి పట్టణం)

మర్పల్లి: బీజేపీ బలోపేతానికి కృషిచేస్తానని బీజేపీ మండల నూతన అధ్యక్షుడు రమేశ్వర్‌రెడ్డి అన్నారు. తనను మండల అధ్యక్షుడిగా చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతీ గ్రామంలో కమిటీల ఏర్పాటుతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

తాండూరు: తాండూరు పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా నాగారం మల్లేశం నియమితులయ్యారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ నర్సిములు తనయుడైన మల్లేశాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి నియమించారు.

పరిగి: పరిగి పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా న్యాయవాది గుండెపల్లి బాలకిష్టారెడ్డి నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. భజరంగ్‌దళ్ కార్యకర్తగా, న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకున్న బాలకిష్టారెడ్డి బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. అయన సేవలను గుర్తించి పరిగి పట్టణ అధ్యక్షుడిగా నియమించారు. బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పనిచేస్తాని, మునిసిపల్ ప్రతీ వార్డులో పార్టీ కమిటీలను వేసి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపునకు శాయశక్తులా కృషిచేస్తానని అన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్‌ను వెంటనే ఎత్తివేయాలి

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 9: జనావాసాల మధ్య కాలుష్యాన్ని వెదజల్లుతున్న రెడీమిక్స్ ప్లాంట్‌ను ఎత్తివేయాలని శనివారం కాచవానిసింగారం గ్రామస్తులు, కాలనీవాసులు ధర్నాచేశారు. రెడీమిక్స్ ప్లాంట్‌తో దుమ్ము ధూళి వస్తోందని అన్నా రు. ఈ ప్లాంట్‌తో ఇబ్బందులు కలుగుతున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. కాలుష్యాన్ని తట్టుకోలేని నగరా నికి దూరంగా ఇండ్లు కట్టుకుంటే ఇక్కడా రెడీమిక్స్ ప్లాంట్ పెట్టి తమని అవస్థలు పెడుతున్నారని తెలిపారు. అధికారులు రెడీమిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



కాచవానిసింగారంలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు, కాలనీవాసులు

మిట్టబాస్పల్లిలో
రోడ్డు పనులు ప్రారంభం

తాండూరు రూరల్, మార్చి 9 : తాండూరు మండలం మిట్టబాస్పల్లి గ్రామంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.10లక్షలతో రోడ్డు పనులు ప్రారంభించారు. శనివారం ఈ పనులను గ్రామ పెద్దలు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ నుంచి కరన్‌కోట్ నాగప్ప ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు మల్లప్ప, నర్సింహులు, ఇస్మాయిల్, గ్రామ పెద్దలు లక్ష్మారెడ్డి, ఇస్మాయిల్, మండల కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు జగదీష్, యూత్ కమిటీ అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ గోవింద్, చిన్న నర్సింహులు, తలారి రాములు తదితరులు పాల్గొన్నారు.



మిట్టబాస్పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న గ్రామస్తులు

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే భవిష్యత్తు



అన్‌లాకింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ కోడింగ్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 9 : భవిష్యత్తు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని అనురాగ్ యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ఏఐ విభాగం ఆధ్వర్యంలో 'అన్‌లాకింగ్ ఫ్యూచర్ ఆఫ్ కోడింగ్' అనే అంశంపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ కోడింగ్‌లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా పరిశోధనలు చేస్తేనే మనం చదువుకున్న చదువుకు సార్థకత చేకూరుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులుపాల్గొన్నారు.

మూడు ఎకరాల పైవారికి రైతుబంధు జమ

తాండూరు, మార్చి 9: రైతుబంధు పైసలు పడ్డాయి. ఈ నెల7వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లోకి రైతుబంధు డబ్బులు జమ అవుతున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం నుంచి రైతులకు మెసేజ్‌లు వస్తున్నాయి. ఇప్పటి వరకు రెండెకరాల రైతులకే రైతుబంధు పడింది. నిలిచిన వారికి డబ్బులు వేయడం ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు 5ఎకరాల్లోపు రైతులందరికీ రైతుబంధు వచ్చే అవకాశాలున్నాయి. రైతుబంధు కోసం ఎదురు చూసిన చిన్న రైతులకు ఖాతాకు డబ్బులు పడుతుండడంతో ఆశలు చిగురించాయి. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపడుతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



ఆటో బోల్తాపడి మృతిచెందిన మల్లేష్

మేడ్చల్ టౌన్, మార్చి 9: మేడ్చల్, వికారాబాద్ జిల్లాల్లో శనివారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. మరికొందరు గాయపడ్డారు. ఈ సంఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ చెక్‌పోస్టు సమీపంలో ఆటో బోల్తాపడి వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు బండ్లగూడకు చెందిన మల్లేష్(40) శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఆలయానికి బయలుదేరగా చెక్‌పోస్టు సమీపంలోని ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. దీంతో మల్లేష్ అక్కడికక్కడే మృతిచెందగా ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి కింద పడి ..

మేడ్చల్ టౌన్: బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మేడ్చల్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కొల్తూరు గ్రామానికి చెందిన బాబు శంకర్(40) శుక్రవారం రాత్రి తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా సోమారం గ్రామం వద్ద బైక్ స్కిడ్ అయింది. దీంతో బైక్ జారి రోడ్డు డివైడర్‌కు ఢీకొనడంతో శంకర్ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారును లారీ ఢీకొని నగర వాసి..



విజయ్‌శేఖర(ఫైల్)

పూడూరు: ఎదురుగా అతివేగంగా వచ్చిన లారీ కారును ఢీకొన్న ప్రమాదంలో కారులోని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమన్‌గుర్తిగేటు వద్ద జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కూకట్‌పల్లికి చెందిన విజయ్ శేఖర్(40),మండలంలోని తిమ్మాపూర్‌నకు చెందిన విజయ భార్యాభర్తలు. శుక్రవారం విజయ్‌శేఖర్ కారులో తన తల్లి శివపార్వతి, భార్య విజయలను తీసుకొని పరిగి మండలం బసిరెడ్డిపల్లిలోని శివాలయానికి వచ్చారు. వారిని ఆలయంలో వది లి విజయ్ తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. శనివారం తల్లి, భార్యను తిరిగి హైదరాబాద్ తీసుకెళ్లేందుకు విజయ్‌శేఖర్ కారు(ఏపీ29 బీటీ5813)లో తిమ్మాపూర్ వస్తున్నాడు. సోమన్‌గుర్తి గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన లారీ(కేఏ32 సీ5862) కారును ఢీకొట్టింది. దీంతో కారు ఇంజన్ వేరుపడి దూరంగా ఎగిరి పడింది. ఈ ప్రమాదంలో విజయ్‌శేఖ ర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోలీసులు పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయ్ భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..



కారు ఢీకొని మృతిచెందిన వ్యక్తి

ఘట్‌కేసర్ రూరల్: రోడ్డుపై పడుకున్న గుర్తుతెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో అతడు మృతిచెందిన సంఘటన పోచారం ఐటీసీ పీఎస్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ బి.రాజువర్మ తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడ ఎన్టీపీసీ చౌరస్తా సమీపంలో 35-40వయస్సు గల ఓ వ్యక్తి వరంగల్-హైదరాబాద్ రోడ్డుపై పడుకున్నాడు. ఏదైనా వాహనం ఢీకొంటుందని వాహనాదారులు అతడిని రోడ్డు పక్కన పడుకోబెట్టారు.ఆ వ్యక్తి మెలకువ రాగానే మళ్లీ రోడుపైనే పడుకున్నాడు. ఈ క్రమంలో ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్ వైపు వస్తున్న కారు(టీఎస్27 బి2613)అతడిని ఢీకొంది. సదరు వ్యక్తి తల, ముక్కు, చెవిల నుంచి రక్తస్రావమైంది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది చేరుకొని వ్యక్తిని పరీక్షించి అతడు చనిపోయినట్లు నిర్ధారించారు. పోలీసులు చేరుకొని పరిశీలించగా మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలూ లభ్యం కాలేదు. అతడు యాచకుడని, మద్యం మత్తులో రోడ్డుపై పడుకోవడం వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం



శిరీష

తాండూరు రూరల్, మార్చి 9: వివాహిత మహిళ అదృశ్యమైన సంఘటన ఎల్మకన్నెలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శిరీష, శ్రీనివాస్ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలున్నాయి. ఈ నెల 5న దంప తులు గొడవపడ్డారు. దీంతో శిరీష ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

కొత్తపల్లిలో మతిస్థిమితం లేని మహిళ...



అలివేలు

కులకచర్ల, మార్చి 9: యువతి అదృశ్యమైన సంఘటన చౌడాపూర్ మండలం కొత్తపల్లిలో జరిగింది. మహబూబ్ నగర్ జిల్లా నవాబుపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లికి చెందిన అలివేలుకు 15సంవత్సరాల క్రితం గండీడ్ మండలం పగిడాలకు చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. పెళ్లి కొన్నాళ్లకే అలివేలు మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తించడంతో ఆమె పట్టింట్లోనే ఉంది. గ్రామంలో తిరుగుతూ ఉండేది. ఫిబ్రవరి 15న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా లభించలేదు. అలివేలు అన్న వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కొలనులో కూరుకుపోయి బాలుడి దుర్మరణం

బషీరాబాద్, మార్చి 9: కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ బాలుడు నీటిగుండం(కొలను)లో ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందిన సంఘటన నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయం వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటకలోని బొందెంపల్లికి చెందిన తుప్పడు ముకుంద్(16) గ్రామస్తులతో కలిసి శుక్రవారం రాత్రి ఆలయానికి వచ్చాడు. శివరాత్రి భజనల్లో పాల్గొన్నారు. శనివారం ఉదయం స్నానానికని గుండం వద్ద మెట్లపై నుంచి దూకడంతో అతడు ఊబిలో కూరుకుపోయాడు. ఎంతకీ తేలకపోవడంతో అక్కడున్న కొందరు ముకుంద్‌ను పైకి తీశారు. ముకుంద్ తీవ్ర అస్వస్థతకు గురికాగా అతడిని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. గుండంలో నీరు తక్కువగా ఉండటంతో బాలుడు చనిపోవడం చర్చనీయంశమైంది. బాలుడిది కర్ణాటక ప్రాంతం కావడంతో చేసేదేమీ లేక మృతదేహాన్ని ఊరికి తీసుకెళ్లి అంత్యక్రియలు జరిపించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు రాలేదని ఎస్సై రమేష్ వెల్లడించారు.